క్లుప్తంగా

ఫీజుల దోపిడీని అరికట్టాలి

బాడంగి: కార్పొరేట్ విద్యాసంస్థల్లో యాజమాన్యాలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి మంగళవారం ధర్నా చేపట్టిన ఆయన కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఇష్టారీతిన ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారని, విద్యాహక్కు చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పెండింగ్‌లోని జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన నిధులు విడుదల చేయాలన్నారు.

మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

రాజాం సిటీ: మణిపూర్‌లో శాంతియువత వాతావరణం నెలకొల్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లోని ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఆదివాసీలపై జరుగుతున్న దాడుల పట్ల ప్రధాని మోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎటువంటి చర్యలకు ఉపక్రమించకపోవడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నా ప్రధానమంత్రి స్పందించకపోవడం దుర్మార్గమైన చర్యన్నారు. ఇప్పటికైనా అక్కడ హింసకు పాల్పడుతున్న అరాచకశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

బొబ్బిలి: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను వ్యతిరేకిస్తూ స్థానిక పట్టణంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ మంగళవారం సాయంత్రం నిర్వహించారు. అక్కడి ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ ఏఈఈ సింహాచలం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నయ్యతో కలిసి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ రమామణి మంగళవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మండలంలో 1,625 ఇళ్లకు గాను 1,133 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని, వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన

బొబ్బిలి: కొత్తగా నిర్మిస్తున్న మండలంలోని జె.రంగరాయపురం రోడ్డును ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ రోడ్డు పూర్తయితే బొబ్బిలి, చీపురుపల్లి నియోజకవర్గాల ప్రజలు ఇన్నాళ్లూ పడిన రోడ్డు కష్టాలు దూరమవుతాయన్నారు.

ఎరువుల పంపిణీ

రేగిడి: మండలంలోని ఉనుకూరు, పారంపేట, అంబఖండి, ఉంగరాడ గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని 25 రైతు భరోసా కేంద్రాల్లో అన్నదాతలకు అవసరమైన డీఏపీ, యూరియా ఉన్నాయని, కావాల్సిన వారు ఆర్‌బీకేలను సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు.

ఉద్యాన పంటల పెంపకాన్ని ప్రోత్సహించాలి

రేగిడి: ఉద్యాన పంటల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన ఖరీఫ్ పనులు ప్రారంభం కాని ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగించాలని తెలిపారు. రైతులకు రాయితీపై జీడి, మామిడి, సపోటా, కొబ్బరి పంటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు.

అందుబాటులో లబ్ధిదారుల వివరాలు

రాజాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయాల డీడీఓలతో మండల ప్రత్యేకాధికారి బి.సుధాకర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన అన్ని గ్రామ సచివాలయాల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. నిర్మాణ దశలోని ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యారోగ్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ అని వాసవీక్లబ్ మనరాజాం-సారథి అధ్యక్షుడు గ్రంథి రవికుమార్ అన్నారు. స్థానిక బజార్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. అనంతరం విద్యార్థులకు పలు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి

గ్రామ గ్రామాన ఓ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, వారికి అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, వారికి అవి అందేలా చర్యలు చేపడుతున్నారు. మంగళవారం పలు గ్రామాల్లో అర్జీదారులకు జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకోకుండా అందజేశారు. గంటల వ్యవధిలోనే తాము అనుకున్న పథకం, ధ్రువపత్రాలు అందుతుండడంతో ఈ కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: కొరటాంలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణ



బొబ్బిలి: రంగరాయపురంలో జరిగిన కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీవేణు గోపాలనాయుడు, జెడ్పీటీసీ శాంతకుమారి



మెంటాడ: ఉద్దంగిలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు



రాజాం సిటీ: కొత్తవలసలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు



వంగర: శివ్వాంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



సంతకవిటి: మిర్తివలసలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని చింతాడ గ్రామంలో దాదాపు రూ.79 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల భవనాలతో పాటు ఎస్సీ కాలనీలో రూ.9.9 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందుకే గ్రామాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువస్తున్నారని ప్రశంసించారు. ప్రస్తుతం గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలతో గ్రామస్తుల అవసరాలు అన్నీ తీరుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లోనే జరిగిపోతున్నాయన్నారు. రైతులకు విత్తనాల దగ్గర నుంచి ఎరువులు, పంట అమ్ముకోవడమంతా ఆర్‌బీకేల్లోనే జరుగుతోందన్నారు. ఏ రకమైన ధ్రువీకరణ పత్రం కావాలన్నా, సంక్షేమ పథకం కావాలన్నా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే వచ్చేస్తున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, అలాగే ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఒకప్పటి పాలనకు ఇప్పటి పాలనకు స్పష్టమైన తేడా ఉందని, ప్రజలంతా దీనిని గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ శాంతకుమారి, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. మండలంలోని విజయరాంపురం, కొరటాం గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను వారు పరిశీలించి, ఎంతమంది రోగులకు తనిఖీలు చేశారని, ఏయే మందులు పంపిణీ చేశారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు అందివ్వాలని, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సూచనలు, సలహాలు చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ ఉమాలక్ష్మి వైద్య శిబిరంలోనే బీపీ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగమణి, తహసీల్దార్ రత్నకుమార్, ఈఓపీఆర్‌డీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు మెమోలు జారీ చేయండి

మెంటాడ: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యానికి తగ్గ ప్రగతి చూపించనందుకు గాను మండలంలోని లోతుగెడ్డ, పోరాం, మెంటాడ, ఇప్పలవలస, జయితి గ్రామాలకు చెందిన కార్యదర్శులతో పాటు పలువురు ఇంజినీరింగ్ సహాయకులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌ను మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన గృహ నిర్మాణ శాఖకు సంబంధించి, 25 లేఅవుట్లకు వెల్‌కమ్ ఆర్చ్‌లు మంజూరయ్యాయని, ఒక్కో ఆర్చ్ నిర్మాణానికి రూ.5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యారోగ్య సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం విద్య, వైద్య, విద్యుత్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలపై సమీక్షించి, పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేయండి

సంతకవిటి: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామగ్రామాన ఫీవర్ సర్వే చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి కె.పద్మలత సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పక్కాగా నిర్వహించి, ప్రజలందరికీ వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. అలాగే నిర్మాణంలోని ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనులు, గడప గడపకు నిధులతో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.

గ్రామాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వి.రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ త్రినాధరావు

తెర్లాం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ జె.త్రినాధరావు సూచించారు. మంగళవారం మండలంలోని వెలగవలస గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజు ఆధ్వర్యంలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వ ఆశయ సాధన దిశగా అడుగులు వేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని కోరారు. సమావేశంలో తెర్లాం హైస్కూల్ హెచ్ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న పద్ధతుల్లో బోధన..

బాడంగి: వినూత్న పద్ధతుల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఆయన తరగతి గది మూల్యాంకనం ద్వారా పరీక్షల నిర్వహణ, నూతన ప్రయోగాలు, బోధనా పద్ధతులు అనుసరించాలని తెలిపారు.



రామభద్రపురం: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

ఎఫ్ఏ-1 పరీక్షలకు సిద్ధం చేయాలి..

రామభద్రపురం: ఆగస్టు మొదటి వారంలో జరిగే ఎఫ్ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు చేశారు. తరగతి గదిలో వినూత్న పద్ధతిలో బోధన చేయడం ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు మెరుగు పడతాయన్నారు. విద్యార్థుల విద్యాప్రగతికి ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందన్నారు. లెస్సన్ ప్లాన్ ప్రకారం విద్యార్థులకు బోధించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనంపై ఆసక్తి పెంచేలా..

రేగిడి: అభ్యసనంపై ఆసక్తి పెంచేలా విద్యాబోధన చేయాలని ఎంఈఓ బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం)ని మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధనాతీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని, నాణ్యమైన విద్యనందించాలని, ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ..

వంగర: మండలంలోని అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు జాతీయ నూతన విద్యావిధానం, నిపుణ్ భారత్, ఎఫ్ఎల్ఎన్ వంటి అంశాలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఖండాపు జగదీశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో బోధన చేసి, వారి విద్యాప్రగతికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఎం.గణపతి పాల్గొన్నారు.



తెర్లాం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ త్రినాధరావు



రేగిడి: దేవుదళ కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ ఎరకయ్య

గడప గడపకూ సంక్షేమం



కొండకవీధిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకూ సంక్షేమం అందించడం జరుగుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పట్టణంలోని లచ్చయ్యపేట-2 సచివాలయం పరిధిలో ఉన్న కొండకవీధి, కొరగంజివీధి, గొర్రెవీధి, మంగళవీధి, మొండివీధి, కాలెపు వీధి కాలనీల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను వారం రోజుల వ్యవధిలో పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పరిపాలనలో గతంలోని టీడీపీ ప్రభుత్వానికి, ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని ప్రజలను కోరారు. అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఓ వైపు సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు అర్హులందరికీ క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అందేలా పాలన చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన పార్టీగా వైఎస్సార్ సీపీ రికార్డు సాధించిందన్నారు. గతంలో టీడీపీ ఇచ్చిన 600 హామీల్లో కనీసం ఆరు అయినా నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో మరోసారి తన మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు అండ్ కో ప్రయత్నిస్తున్నారని, వారిని నమ్మవద్దన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, కె.శేఖర్, వి.విజయ్‌కుమార్, టి.తిరుమలరావు, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

బొబ్బిలి: ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని ఆర్‌డీఓ పి.శేషశైలజ కోరారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశమైన ఆమె ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబిత సవరణ చేపడుతున్నామని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మృతి చెందిన ఓటర్ల తొలగించడం చేస్తున్నామని, అందరూ సహకరిస్తేనే పక్కాగా ఓటర్ల జాబితా తయారవుతుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, సంబంధిత ఇళ్ల వద్దకు వెళ్లి, వారి సంతకం తీసుకుని, ఓటరుసర్వే చేయాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లోనూ స్వీప్ యాక్టివిటీస్ చేపడతామన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రాముద్రి గోవిందరావు, రాంబార్కి శరత్, మువ్వల శ్రీనివాసరావు, ఎన్నికల ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శేషశైలజ

అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీసు



అంగన్‌వాడీ టీచర్ చెంచులక్ష్మికి షోకాజ్ నోటీస్ అందజేస్తున్న ఐసీడీఎస్ క్లస్టర్ సూపర్‌వైజర్ సూర్యకుమారి



ఐసీడీఎస్ క్లస్టర్ సూపర్‌వైజర్ విజిట్ చేసినప్పుడు సంతకాలు లేని హాజరు పట్టిక



విజిట్ తర్వాత టీచర్ సంతకాలు చేసినట్లు హాజరు పట్టిక

రామభద్రపురం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-6 టీచర్ సీహెచ్ చెంచులక్ష్మికి ఐసీడీఎస్ అధికారులు మంగళవారం షోకాజ్ నోటీస్‌లు ఇచ్చారు. ఇటీవల సచివాలయం-1 పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రసంగాన్ని వక్రీకరించి, ఓ రాజకీయ ప్రతిపక్ష నాయకురాలిలా తీవ్ర విమర్శలు చేసినందుకు గాను ఆమెపై చర్యలకు అధికారులు ఉపక్రమించారు. ఎమ్మెల్యే అనని మాటలను కూడా ఆడినట్లు ఆరోపిస్తూ ఆమె చేసిన ఆడియో, వీడియోలు పలు వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ కావడంతో రాజకీయ దుమారం రేగింది. స్పందించిన ఐసీడీఎస్ అధికారులు క్లస్టర్ సూపర్‌వైజర్ ద్వారా సదరు అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని బాడంగి శాఖ సీడీపీఓ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు క్లస్టర్ సూపర్‌వైజర్ సూర్యకుమారి మంగళవారం కేంద్రానికి వెళ్లి, ఆ అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీస్ అందజేశారు. అనంతరం సూపర్‌వైజర్ మీడియాతో మాట్లాడుతూ ఈమె విధుల నిర్వహణలోనూ నిర్లక్ష్యం వహించినట్లు తమ పర్యవేక్షణలో గుర్తించామని, ఈ నెల 7వ తేదీన కేంద్రాన్ని విజిట్ చేయగా, కేంద్రంలో 10 మంది పిల్లలు ఉండాల్సి ఉండగా, ఐదుగురు మాత్రమే ఉన్నారని, అయితే 10 మంది పిల్లలకు హాజరు వేసినట్లు చూపించడం జరిగిందన్నారు. అలాగే ఈ నెల 1వ తేదీ నుంచి హాజరు పట్టికలో పేర్లు రాయడం లేదని, సంతకాలు కూడా చేసినట్లు లేదన్నారు. హాజరు రిజిస్టర్‌లో క్వశ్చన్ మార్క్ పెట్టి, ఈ విషయాన్ని నోట్ చేశానని, కొద్దిసేపటి తర్వాత టీచర్ మొత్తం ఆ ఏడు రోజుల సంతకాలు చేసేసి, తనకు వాట్సాప్ మేసేజ్ చేయడాన్ని బట్టి ఆమె తప్పు చేసినా విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నట్లు ఆమె ప్రదర్శించిన ధైర్యం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఇదేకాకుండా షోకాజ్ ఇవ్వడానికి వెళ్లిన రోజు కూడా కేంద్రంలో 10 మంది పిల్లలకు గాను ఐదుగురే ఉన్నారని, మిగతా ఐదుగురు పిల్లలు ఎక్కడని ప్రశ్నించగా, కళ్లకలకలు వచ్చిన పిల్లలని, వారిని ఇంటికి పంపించేశానని పొంతనలేని సమాధానమిచ్చారన్నారు. పాత విజిట్ రికార్డు చూపమన్నా చూపలేదని, కొత్తది తీసుకు వచ్చి చూపారన్నారు. ఆమె విధుల నిర్లక్ష్యంపై ఓ నివేదిక తయారు చేసి, ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

ఘనంగా పోలమ్మతల్లి పండగ

బాడంగి: మండల కేంద్రంలో పోలమ్మతల్లి వారాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం అమ్మవారి ఘటాల తిరువీధి చేపట్టారు. వర్షంలోనూ మండల కేంద్రం శివారులోని అమ్మవారి ఆలయం వద్దకు భక్తులు వెళ్లి, పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ, దేవరాపల్లి శ్రీను, సర్పంచ్ కండి రమేష్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు.